# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 14, జూన్ 2026


## కంటి పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి

నిర్మల్, జూన్ 13, ప్రభాతవార్త:



నిర్మల్ పట్టణంలో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కూచాడి సత్యమ్మ-ప్రకాశ్‌రావు కంటి పరీక్ష కేంద్రాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరిరావు తన తల్లిదండ్రులు సత్యమ్మ-ప్రకాశ్‌రావు జ్ఞాపకార్థం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన నేత్ర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కేంద్రం ద్వారా కంటి సమస్యలను తొలిదశలోనే గుర్తించి సకాలంలో నాణ్యమైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. క్లిష్టమైన నేత్ర సమస్యలు ఉన్న రోగులకు మిగతా 2లో..





# ప్రజల కోసం ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంది

**✪ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 13, ప్రభాతవార్త

ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం జిల్లాలోని దండేపల్లి మండలం గూడెంలో గల శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులను రాష్ట్ర ఐ.టి., ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, భూపాలపల్లి, రామగుండం నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, గండ్ర సత్యనారాయణ, మక్కన్‌సింగ్ ఠాకూర్, మంచిర్యాల, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు ధర్ని మధుకర్, మహంకాళి స్వామిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి 2 వేల 216 కోట్ల రూపాయలతో చర్యలు తీసుకుంటున్నామని, సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, రాబోవు గోదావరి పుష్కరాలలో పుష్కర ఘాట్ల నిర్మాణం, అవసరమైన వసతుల కొరకు 1 వేయి కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు 802 కోట్ల రూపాయలతో ఆధ్యాత్మిక కారిడార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు 70 కోట్ల రూపాయల నిధులతో గూడెం దేవాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని, పిప్రి వేదికగా రాష్ట్ర ముఖ్యమంత్రిచే గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి 37 రోజుల వ్యవధిలోనే పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో మిగతా 2లో..

## కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉద్ధృతం చేయాలి

**● సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ**

నస్పూర్, జూన్ 13, ప్రభాతవార్త




కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయి. వీటికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను మరింత ఉద్ధృతం చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. శనివారం మంచిర్యాల జిల్లా నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో కనికరపు అశోక్ అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ధరల భారాన్ని మోపుతోందని, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎన్నికల హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ప్రయత్నాలను విరమించుకొని, ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో విద్య, వైద్యం, ఫీజులు, నిరుద్యోగం, పెన్షన్లపై రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాల్లో ఇండ్లు, మిగతా 2లో..















# కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉద్ధృతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

పోడు భూములు, మౌలిక వసతుల సమస్యలపై ప్రజా ఉద్యమాలు చేపడతామని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారి రవికుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మంచిర్యాల జిల్లా నూతన కార్యదర్శిగా బోడంకి చందును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పైళ్ల ఆశయ్య, ప్రకాష్, పున్నం, దుంపల రంజిత్ కుమార్, ఉమారాణి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

# కంటి పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన అంతర్జాతీయ నిపుణుల సేవలు అందుబాటులో ఉంటాయని మంత్రి వెల్లడించారు. ఈ కంటి పరీక్ష కేంద్రం నిర్మల్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దాత కూచాడి శ్రీహరిరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వైద్యులు, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

## - ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 13, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని గద్దరాగడి ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన కాకతీయ పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని కోరుతూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మండల విద్యాశాఖ నిబంధనలో విరుద్ధంగా పాఠశాలను ఏర్పాటు చేయడంతో పాటు యాజమాన్యం బిల్డింగ్ లీజు అగ్రిమెంటు లేకుండానే ఇతర శాఖల నుంచి అనుమతులు తీసుకొని ఆయా శాఖల అధికారుల తప్పు తోవ పట్టించారని ,పాఠశాలకు సంబంధించి బిల్లింగ్ లీజు అగ్రిమెంటు లేకుండానే ఎన్వోసి సర్టిఫికెట్లు జారీ చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి అన్నారు. ఆయా శాఖల అధికారులకు కాకతీయ పాఠశాల అనుమతుల విషయంలో అధికారులకు పెద్ద మొత్తంలో తాయిళాలు ముట్టినట్లు ప్రజల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. ఈ అనుమతులు ఏవి కూడా క్షుణ్ణంగా పరిశీలించకుండానే పాఠశాలకు ఓపి పర్మిషన్లు ఇవ్వడం ఏంటని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. విద్యాశాఖ అధికారులనూ మేము ఒకటే అడుగుతా ఉన్నాము పాఠశాల భవనం ముందా....! లేక ఆయా శాఖల ఎన్ఓసిలు ముందా...! అని దుయ్యబట్టారు ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు విద్యాశాఖను తప్పుదోవ పట్టించిన యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి క్షేత్రస్థాయిలో పరిశీలినలో బాధ్యులైన మండల విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకొని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తెలంగాణ కు ఫిర్యాదు చేస్తామని పెద్ద ఎత్తున భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ, తెలంగాణ విద్యార్థి సమైక్య మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రేగుంట క్రాంతి కుమార్, నేషనల్ స్టూడెంట్ కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బచ్చలి అభిరామ్, విద్యార్థి సంఘాల నాయకులు హర్షిత్, కార్తీక్, విష్ణు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల కోసం ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంది

(మొదటిపేజీ తరువాయి)

ఆధ్యాత్మిక క్షేత్రాల పునరుద్ధరణకు భారీగా నిధులు మంజూరు చేయడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధిలో భాగంగా గూడెం గుట్ట పరిధిలో 74 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అన్ని రంగాల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో విద్య, వైద్యం, వ్యవసాయ, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధిలో నియోజకవర్గ శాసనసభ్యులు కృషి అభినందనీయమని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు భవిష్యత్తులో ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ఐ. టి. శాఖ మంత్రి మాట్లాడుతూ దేవాదాయ శాఖ అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. రాబోవు గోదావరి పుష్కరాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా మంచిర్యాల నియోజకవర్గంలో ఏ ఒక్క పంట ఎండిపోలేదని, ప్రకృతితో కలిసి జీవిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలతో పాటు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.

అనంతరం పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 9 కోట్ల 70 లక్షల రూపాయల మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ సంఘ భవనాల నిర్మాణం, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలో 2 కోట్ల 30 లక్షల రూపాయల నగరాభివృద్ధి నిధులతో సి.సి. రోడ్డు పనులు, 2 కోట్ల రూపాయలతో మురుగునీటి కాలువ నిర్మాణ పనులు, దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం పరిధిలో 58 ఒట్ల రూపాయల అంచనా నిధులతో ఆలయ పున: నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలలోని మోదెల, ద్వారక, గుడి రేవు గ్రామాల సమీపంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎడమవైపున 74 కోట్ల 40 లక్షల రూపాయల అంచనా నిధులతో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో బిఆర్ఎస్ శక్తి ప్రదర్శన

## - సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ కార్యక్రమాలకు భారీ సన్నాహక సమావేశం

బెల్లంపల్లి, జూన్ 13, ప్రభాతవార్త



బెల్లంపల్లి పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం (ఏ3 క్వార్టర్)లో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అధ్యక్షతన, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు మరియు ఎస్ ఐ ఆర్ కార్యక్రమాలపై సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులు, ముఖ్య అతిథులు మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి అండగా నిలుస్తున్న ప్రతి కార్యకర్తను కంటికిరెప్పలా కాపాడుకుంటామని, రానున్న రోజుల్లో పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు వారికి తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఈసారి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నందున, ఆయా బూత్ ఇంచార్జీలు సభ్యత్వ నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమమైన ఎస్ఐఆర్‌లో కూడా బిఆర్ఎస్ పార్టీ బిఎల్ఎలు అప్రమత్తంగా ఉండి అధికారులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, నూనెటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇంచార్జీలు, బిఎల్ఏ లు మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలి

## - జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయండి - తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్

కాగజ్‌నగర్ రూరల్, జూన్ 13, ప్రభాతవార్త



మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్

కేంద్ర ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నిస్తున్న విబిజి రాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని చింతగూడ కోయవాగుల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన, కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కొత్త చట్టం అమలుతో గ్రామీణ ప్రాంతాల్లో పనుల లభ్యత తగ్గి వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ కూలీలకు రోజుకు కనీసం రూ.600 వేతనం చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం గతంలో మాదిరిగానే 90 శాతం నిధులను నేరుగా విడుదల చేయాలని కోరారు. కూలీలకు ఇబ్బందులు కలిగిస్తున్న రోజుకు రెండుసార్లు ఫొటోలు తీసే విధానాన్ని రద్దు చేయడంతో పాటు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పనిస్థలాల్లో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ నెల 16న కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రథమ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పురుషోత్తం, బొర్కుట్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి మార్కెట్ కమిటీకి కొత్త పాలకవర్గం

### - చైర్మన్‌గా రత్నం సుకుమారి నియామకం

**బెల్లంపల్లి జూన్ 13, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గంలో మార్కెట్ కమిటీకి కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రత్నం సుకుమారిని, వైస్ చైర్మన్‌గా సంగర్సు రవీందర్ రావుని నియమిస్తూ వ్యవసాయ మార్కెట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె. సురేంద్ర మోహన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆశీస్సులతో జరిగిన ఈ నియామకాల అనంతరం, నేడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రత్నం సుకుమారి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ను కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఇప్పటికే చైర్మన్ నియామక ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి రత్నం సుకుమారి సమర్థవంతంగా పనిచేసి రైతులు, వ్యాపారులకు న్యాయం చేసే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రత్నం సుకుమారి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, మార్కెట్ కమిటీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కూడా నూతన చైర్మన్ మరియు వైస్ చైర్మన్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి రమేష్ బాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లిలో క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తా

### - ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

**బెల్లంపల్లి, జూన్ 13, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ప్రాంతంలో క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని శ్రీ మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ నిర్మించిన మూడవ క్రికెట్ పిచ్‌ను శుక్రవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ పట్టణంలో మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ క్రికెట్ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. అకాడమీ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎస్.జి.ఎఫ్ జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ ఎస్.జి.ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే అండర్-14, అండర్-17 క్రికెట్ పోటీలను ఈసారి బెల్లంపల్లిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ సభ్యులు నాతరి స్వామి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బండి ప్రభాకర్, బెల్లంపల్లి ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రాజేష్, న్యాయవాది నల్లుల సంగీత, అకాడమీ నిర్వాహకులు అల్లం వెంకటేశ్వర్లు, జాడి శేఖర్, గౌతమ్, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు చేయూత

### - ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**భైంసా, జూన్ 12, ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అనారోగ్యం బారిన పడిన పేదలకు ప్రభుత్వం తరపున ఎంతగానో చేయూత లభిస్తోందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. భైంసా పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఇండస్ట్రీలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన 135 మంది లబ్ధిదారులకు రూ.28 లక్షల 29 వేల 600 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పేద ప్రజలను ఆదుకోవడమే తమ లక్ష్యమన్నారు. అందుకోసమే తన క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక సిబ్బందిని నియమించి, త్వరితగతిన చెక్కులు అందేలా పంపిణీ ప్రక్రియను వేగవంతం చేశామని చెప్పారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా, రెండున్నర సంవత్సరాల కాలంలోనే వేలాది మంది లబ్ధిదారులకు కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించినట్లు వివరించారు. పేదలకు సకాలంలో నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. విద్య, వైద్యం, సాగునీరు అందించడమే ధ్యేయంగా తాను ముందుకు సాగుతున్నానని, అందులో భాగంగానే ముధోల్ నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు పెద్ద మొత్తంలో నిధులను తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, బీజేపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

## అమెరికాలో ప్రమాదానికి గురైన నస్పూర్ యువతి..

### - పెరిక సంఘం ఆర్థిక సాయం

### - కోమాలో ఉన్న స్పందన కుటుంబానికి రూ. 1.51 లక్షల విరాళం

**నస్పూర్, జూన్ 13, ప్రభాతవార్త**

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడ జరిగిన ఘోర ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన లగిశెట్టి స్పందన కుటుంబానికి పెద్దపల్లి జిల్లా పెరిక సంఘం అండగా నిలిచింది. చికాగో నగరంలో మే 31న మెట్రో స్టేషన్ పైభాగం నుంచి సుమారు 25 అడుగుల ఎత్తు నుంచి కిందపడటంతో స్పందన కోమాలోకి వెళ్లి చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలిసి తీవ్ర ఆందోళనలో ఉన్న ఆమె తల్లిదండ్రులు లగిశెట్టి శ్రీనివాస్, సునీత దంపతులను శనివారం సంఘం ప్రతినిధులు పరామర్శించి ధైర్యం చెప్పారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి, పెద్దపల్లి జిల్లా పెరిక సంఘం అధ్యక్షులు దుండే మల్లేష్, రామగుండం కార్పొరేషన్ పెరిక సంఘం అధ్యక్షులు పోతరాజుల అంజయ్య ఆధ్వర్యంలో నాయకులు బాధిత ఇంటికి వెళ్లారు. కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా ఇస్తూ సంఘం తరపున తక్షణ సాయంగా రూ. 1,51,216 నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. కన్నబిడ్డ ప్రాణాల కోసం పోరాడుతుంటే ఆ తల్లిదండ్రులు పడుతున్న వేదన మాటల్లో చెప్పలేనిదని, స్పందన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు కందుల సంధ్యారాణి, దుండే మల్లేష్ పేర్కొన్నారు. దాతలు, సేవాభావం కలిగిన వారు కూడా ముందుకు వచ్చి ఈ కుటుంబానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కష్టాల్లో ఉన్నప్పుడు చేయూతనిచ్చే చేతులే నిజమైన బంధాలని, ఒక బిడ్డ ప్రాణాలను కాపాడేందుకు సమాజం ఏకం కావాలని పోతరాజుల అంజయ్య తెలిపారు. స్పందన ఆరోగ్యంగా కోలుకుని మళ్లీ కుటుంబం ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పెరిక సంఘం జిల్లా అధ్యక్షులు బొడ్డు శంకరయ్య, కార్పొరేటర్ కుమారస్వామి, సంఘం నాయకులు బత్తుల రమేష్, అక్కల నారాయణ, ఉగ్గే కుమార్, రాజు, తిప్పని రాయలింగు, కందుల శంకరయ్య, మార్త రాజేశం పాల్గొన్నారు.



## బీఎల్ఓ సమావేశానికి ప్రతి బూత్ స్థాయి నుంచి హాజరు కావాలి

### - మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్

**భైంసా, జూన్ 13, ప్రభాతవార్త:**

ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు నిర్వహించనున్న బీఎల్ఓ శిక్షణ సమన్వయ సమావేశానికి ప్రతి గ్రామం నుంచి బూత్ కమిటీ సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్ పిలుపునిచ్చారు. భైంసా పట్టణంలోని శ్రీ బ్యాంకెట్ హాల్‌లో ఉదయం 11:00 గంటలకు ఈ శిక్షణ శిబిర కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. సార్ 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ తరపున నియమించిన బూత్ కమిటీ సభ్యులకు ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ అబ్జర్వర్ భూక్యా కొట్టే నాయక్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేస్తారని మాజీ ఎమ్మెల్యే వివరించారు. కావున నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సొసైటీ చైర్మన్లు, ఆత్మ చైర్మన్లు, ఆత్మ డైరెక్టర్లు, ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, యూత్ కాంగ్రెస్‌తో పాటు అనుబంధ సంఘాల నాయకులంతా ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో ముధోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు పండుగలా జరగాలి

### - బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, జూన్ 13, ప్రభాతవార్త:**

బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నేరడిగొండ మండల కేంద్రంలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన బోథ్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తల భారీ ఉత్సాహం, విశేష స్పందన మధ్య ఈ సమావేశం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాలు, వార్డులు, మండల కేంద్రాల్లో విస్తృత ప్రచారం చేపట్టి ప్రతి ఇంటికీ పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్తూ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు ఎంతో కీలకమని, ప్రతి కార్యకర్త క్రియాశీలకంగా వ్యవహరిస్తూ అత్యధిక సంఖ్యలో సభ్యత్వాలను చేయించాలని కోరారు. బీఆర్ఎస్ కుటుంబాన్ని మరింత విస్తరించే లక్ష్యంతో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సీపీగెట్ దరఖాస్తు గడువు జూన్ 15 వరకు పొడిగింపు

**బెల్లంపల్లి, జూన్ 13, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో పీజీ కోర్సులలో ప్రవేశాల కోసం సీపీగెట్-2026 దరఖాస్తుల గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. కళాశాలలో ఎంఏ ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, ఎం.కామ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న, ఇప్పటికే డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు సీపీగెట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉన్నత విద్యాశాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం సమన్వయంతో నిర్వహించే తెలంగాణ స్టేట్ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ టెస్ట్ నోటిఫికేషన్‌లో భాగంగా దరఖాస్తు తేదీలలో సవరణలు జరిగాయని తెలిపారు. ఎంఏ ఇంగ్లీష్ మరియు పొలిటికల్ సైన్స్ కోర్సులకు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు కాగా, ఎం.కామ్ కోర్సుకు బీకాం పూర్తి చేసిన వారు మాత్రమే అర్హులని వివరించారు. ఇంకా వివరాల కోసం 9959269975 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# వర్షాల జాడ లేక రైతుల్లో ఆందోళన..

## సాగు పనులపై తీవ్ర ప్రభావం - బోరు నీటితో ఒకరి సాగు.. వర్షాల కోసం మరొకరి నిరీక్షణ

దిలావర్‌పూర్, జూన్ 13, ప్రభాతవార్త:




ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతాంగంలో తీవ్ర ఆందోళన నెలకొంది. రోహిణి, మృగశిర కార్తెలు దాటిపోతున్నా వర్షాలు ముఖం చాటేయడంతో వర్షాధార రైతులు సాగు పనులు ప్రారంభించాలా, వద్దా అనే అయోమయంలో పడ్డారు. మరోవైపు బోరు బావుల సౌకర్యం ఉన్న రైతులు మాత్రం ఆలస్యం చేయకుండా పత్తి, సోయాబీన్ విత్తనాలు వేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ముందుగా విత్తిన పంటలు ఇప్పటికే మొలకెత్తాయి. వర్షాలు లేకపోయినా బోరు నీటి సదుపాయం, డ్రిప్ విధానం ద్వారా తడులు అందిస్తూ పంటలను కాపాడుకుంటున్నారు. అయితే పూర్తిగా వర్షాలపైనే ఆధారపడిన పేద, మధ్యతరగతి రైతుల పరిస్థితి భిన్నంగా ఉంది. విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నప్పటికీ నేలలో అసలు తేమ లేకపోవడంతో విత్తేందుకు వెనుకాడుతున్నారు. ఒకవేళ ఆత్రుతతో ముందే విత్తనాలు వేస్తే, వర్షాలు మరింత ఆలస్యమైతే విత్తనాలు మొలకెత్తక పెట్టుబడి పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని రైతుల దృష్టి చూపంతా ఆకాశంపైనే ఉంది. సకాలంలో రుతుపవనాలు విస్తరించి, వర్షాలు కురిస్తేనే సాగు పనులు వేగవంతం అవుతాయని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.




## హరికృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు విరాళం

తాండూర్, జూన్ 13, ప్రభాతవార్త

మండలంలోని గోపాల్ నగర్ గ్రామ పంచాయతీకి హరికృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ కంబాల నర్సయ్య తన కూతురు కంబాల గాయత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం రూ.50 వేల విలువైన 8 సీసీ కెమెరాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ నర్సయ్య మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, ప్రజల భద్రత కోసం సామాజిక బాధ్యతతో సీసీ కెమెరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ గాల్ల నర్సయ్య మాట్లాడుతూ సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. సీసీ కెమెరా అందజేసిన ట్రస్ట్ చైర్మన్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్, ఉప సర్పంచ్ సునీత, వార్డు సభ్యుడు కంబాల బాలయ్య, కంబాల తిరుపతి, గాజుల రమేష్, కంబాల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఓపెన్ యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్షలు

కాగజ్‌నగర్ రూరల్, జూన్ 13, ప్రభాతవార్త

డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్‌లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు సెమిస్టర్6 పరీక్షలు జూన్ 14 నుండి, సెమిస్టర్4 పరీక్షలు జూన్ 22 నుండి, అలాగే సెమిస్టర్2 పరీక్షలు జూలై 1 నుండి నిర్వహించబడనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి కె. శ్రీదేవి, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ తెలిపారు. సెమిస్టర్4, సెమిస్టర్2 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు రూ.500 అపరాధ రుసుముతో కలిపి పరీక్షా రుసుమును జూన్ 16, 2026 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు ఒరిజినల్ లేదా ఇతర గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని సూచించారు. అలాగే పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, పుస్తకాలు లేదా ఇతర ఎలాంటి మెటీరియల్‌ను తీసుకురావద్దని హెచ్చరించారు.అన్ని విద్యార్థులు పరీక్షల షెడ్యూల్‌ను గమనించి, నిర్దేశిత నిబంధనలను పాటిస్తూ పరీక్షలకు హాజరుకావాలని యాజమాన్యం కోరింది.

## సింగరేణి మందమర్రి ఏరియాలో వాహనాల స్థితిగతులపై సమీక్ష

మందమర్రి, జూన్ 13, ప్రభాతవార్త



సింగరేణి సంస్థ జీ.ఎం (ఈ అండ్ ఎం) ట్రాన్స్‌పోర్ట్ రామనాదం మందమర్రి ఏరియాను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించబడింది. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో ఏరియాలోని వాహనాల ప్రస్తుత పరిస్థితులు, నిర్వహణ విధానాలపై సమగ్రంగా సమీక్షించారు. సమావేశంలో భాగంగా, ఏరియా పరిధిలో నడుస్తున్న సంస్థ సొంత వాహనాలపై విపులమైన వివరాలను జీ.ఎం కోరారు. వాహనాల రకం, ఆర్టీఏ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్ స్థితి, వాహనాల ప్రస్తుత కండిషన్, కేటాయింపుల వివరాలతో పాటు తుక్కు కింద తొలగించాల్సిన వాహనాల జాబితాపై కూడా సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా అద్దె వాహనాల నిర్వహణపై కూడా విశ్లేషణాత్మకంగా చర్చించారు. వాహనాల రకం, సంబంధిత కాంట్రాక్టర్ పేరు, డిప్లాయ్‌మెంట్ తేదీలు, వర్క్ ఆర్డర్ నంబర్లు, కాంట్రాక్ట్ ముగింపు తేదీలు, యుఐడి నంబర్లు, కేటాయించిన ప్రాంతాల వివరాలను అధికారుల నుంచి సేకరించి సమీక్షించారు. ఈ సమావేశంలో ఏరియా ఇంజనీర్ (ఈ అండ్ ఎం) బాలాజీ భగవతి ఝా, డీజీఎం (పర్సనల్) అశోక్, ఏజీఎం (ఎఫ్ అండ్ ఏ) ఆర్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మొదటి రోజ్ గార్ దివస్ నిర్వహణ

ఆసిఫాబాద్, జూన్ 13, ప్రభాతవార్త



మొదటి రోజ్ గార్ దివస్ నిర్వహణను రాజంపేట గ్రామ పంచాయతీలో ఘనంగా నిర్వహించారు. శని వారం పంచాయతీ పరిధిలోని స్థానిక ఉపాధి హామీ పని ప్రదేశం వద్ద రోజ్ గార్ దివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాజంపేట గ్రామ పంచాయతీ నూతనంగా ఏర్పడిన సందర్భంగా మొదటిసారిగా జరోజ్ గార్ దివస్‌చ (ఉపాధి హామీ కూలీల గ్రామ సభ) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ కూలీల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతి నెలా జరోజ్ గార్ దివస్‌చ నిర్వహించాలని ఆదేశించిందని, ఈ నేపథ్యంలో పంచాయతీలో ఇలా మొట్టమొదటి కార్యక్రమమని తెలిపారు. ఇకపై ప్రతి నెలా కూలీలతో ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించడమే కాకుండా ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు.జూలై 1 నుండి రాబోయే మార్పులపై కూలీలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ ఇంకుడు గుంతలు, మొక్కలు నాటడం, ఉపాధి కూలీ చెల్లింపులువంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రెటరీ, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.




## ప్రైవేట్ బడి వద్దు - ప్రభుత్వ బడి ముద్దు

### కార్పొరేట్ దోపిడీని అరికట్టాలి

భైంసా, జూన్ 13, ప్రభాతవార్త:

రాష్ట్రవ్యాప్తంగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో, ముధోల్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా యూనియన్ నిర్మల్ జిల్లా కార్యదర్శి గడిపాల పరమేష్ మాట్లాడుతూ బడులు తెరుచుకుంటున్న తరుణంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్లు, పుస్తకాలు, యూనిఫారాల పేరుతో పేద, మధ్యతరగతి తల్లిదండ్రులను నిలువునా దోచుకుంటున్నాయని మండిపడ్డారు. అనుమతులు లేని స్కూళ్లు సైతం ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యా చట్టాలను తుంగలో తొక్కుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు కేటాయించాల్సిన 25 శాతం ఉచిత సీట్ల నిబంధనను ఎక్కడా అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల్లో దోపిడీని అరికట్టేందుకు తక్షణమే ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన కల్పించాలని డిమాండ్ చేశారు. ఒకే అనుమతితో నియోజకవర్గ వ్యాప్తంగా నడుపుతున్న అక్రమ ప్రైవేట్ బ్రాంచీలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, ప్రైవేట్ స్కూళ్లలో దోపిడీకి గురైనా విద్యార్థులు, తల్లిదండ్రులు నేరుగా తమను సంప్రదించవచ్చని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గ నాయకులు నితిన్, అఖిలేష్, నిఖిల్ పాల్గొన్నారు.

## అగ్నివీర్‌లుగా ఎంపికైన ముగ్గురు యువకులు

### - ప్రభుత్వ డిగ్రీ కళాశాల యాజమాన్యం అభినందనలు

కాగజ్‌నగర్ రూరల్, జూన్ 13, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఇండియన్ ఆర్మీలో అగ్నివీర్‌లుగా ఎంపికయ్యారు. బి.ఏ విద్యార్థి మాందోరే శంకర్, బి.కాం విద్యార్థి గౌత్రే కళ్యాణ్, బి.ఎస్సీ విద్యార్థి కొమినవేని సతీష్‌లు ఇటీవల నిర్వహించిన అగ్నివీర్ నియామక ప్రక్రియలో ప్రతిభ కనబర్చి ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి, కెరీర్ గైడెన్స్ సెల్ ఇన్‌చార్జి డాక్టర్ లక్ష్మీనరసింహం తెలిపారు. గత ఏడాది నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న వీరు రాత పరీక్షతో పాటు శారీరక దారుఢ్య పరీక్షల్లోనూ ఉత్తీర్ణత సాధించి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు వారిని అభినందించారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలపై నిరంతరం అవగాహన కల్పిస్తూ ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఉద్యోగ నోటిఫికేషన్లపై సమాచారం అందించడంతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.సోమవారం నుంచి కళాశాలలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 7013607011 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



ఇండియన్ ఆర్మీలో అగ్నివీర్‌లుగా ఎంపికైన విద్యార్థులు

# కార్మిక సంక్షేమంలో రాజీపడేది లేదు..

- ప్రజాస్వామ్య రక్షణలో జాగరుకతతో ఉంటాం... కాపాడుకుంటాం... - సింగరేణి సంస్థ తెలంగాణ ప్రజల ఆస్తి - రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క



నస్పూర్, జూన్ 13, ప్రభాతవార్త

సింగరేణి కార్మికుల సంక్షేమంలో రాజీపడేది లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో వైద్య పరంగా పనిచేయలేని సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందించే కార్యక్రమానికి రాష్ట్ర ఐ.టి., ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్ముఖ్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, బెల్లంపల్లి, భూపాలపల్లి, వైరా నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, సత్యనారాయణ, మలోత్ రాందాస్ నాయక్, సింగరేణి కార్మిక సంఘాల ప్రతినిధులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్ ప్రసాద్, ప్రజా ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమంలో రాజీపడేది లేదని, సింగరేణి సంస్థ తెలంగాణ ప్రజల ఆస్తి అని, ప్రజాస్వామ్య రక్షణలో జాగరుకతతో ఉంటామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ పునరుద్ధరణ కొరకు 70 కోట్ల రూపాయలు, మినీ లిఫ్ట్ ఇరిగేషన్ కొరకు 74 కోట్ల 40 లక్షల రూపాయలతో పాటు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. వైద్యపరంగా పనిచేయలేని సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన 335 మంది అర్హత గల అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరుగుతుందని, భవిష్యత్తులో మరింత మంది అర్హులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడుకుందాం అని, తెలంగాణ ఆస్తిగా తీర్చిదిద్దుదామని తెలిపారు. సింగరేణి కార్మికులకు 1 కోటి 25 లక్షల బీమా అందించడం జరుగుతుందని, 30 వేల మంది ఒప్పంద/పొరుగు సేవల సిబ్బందికి బోనస్ అందించామని తెలిపారు. కోల్ బ్లాక్స్ లలో పూర్తి నిఘా వ్యవస్థ మధ్యలో పని జరుగుతుందని, తెలంగాణ వనరులను కాపాడతామని తెలిపారు. కోల్ బెల్ట్ ప్రాంతంలోని శాసనసభ్యులతో మాట్లాడి కార్మిక సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం, సింగరేణి సంస్థ సమన్వయంతో సింగరేణి బొగ్గు గనులను మరింత అభివృద్ధి చేసి కార్మికుల సంక్షేమం దిశగా కృషి చేస్తామని తెలిపారు.



రాష్ట్ర ఐ. టి. శాఖ మంత్రి మాట్లాడుతూ సింగరేణి సంస్థను, తెలంగాణ నల్ల బంగారం బొగ్గును కాపాడుకుందాం అని, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మెడికల్ అన్ ఫిట్ విషయంలో పారదర్శకంగా ముందుకు వెళదామని తెలిపారు. సింగరేణి కార్మికులకు 1 కోటి 25 లక్షల రూపాయలతో పాటు ఒప్పంద/పొరుగు సేవల సిబ్బందికి 40 లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. సింగరేణి సంస్థ లాభాలలో సింగరేణి కార్మికులతో పాటు ఒప్పంద కార్మికులకు లాభాల వాటా అందించడం జరిగిందని తెలిపారు.

మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ నియామక పత్రాలు అందుకున్న 335 మందిలో 117 మంది మంచిర్యాల జిల్లాకు చెందిన వారు కావడం సంతోషంగా ఉందని తెలిపారు. సింగరేణి సంస్థలో మారుపేరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఒక కమిటీని నియమించి పర్యవేక్షించడం జరుగుతుందని, బాధితులకు తప్పనిసరిగా న్యాయం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం కార్మికుల పక్షాన ఉంటుందని, పదవీ విరమణ పొందిన సింగరేణి కార్మికులకు తెల్ల రేషన్ కార్డులు అందించడం జరిగిందని తెలిపారు. రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి వెలుగులు అందిస్తున్న కార్మికుల శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు. సింగరేణి ప్రాంతాలలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను పదవీ విరమణ పొందిన కార్మికులకు అందించి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింప చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్నులు వెసలుబాటు కల్పించాలని, జిల్లాలోని మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో గల శ్రీరాంపూర్ ప్రాంతంలో అర్హులకు పట్టాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బెల్లంపల్లి శాసనసభ్యులు మాట్లాడుతూ 1992లో సింగరేణి సంస్థను 450 కోట్ల రూపాయలకు బిఐఎఫ్ఆర్ క్రిందకు పంపించడాన్ని ఆనాడు గడ్డం వెంకటస్వామి అడ్డుకొని కాపాడారని గుర్తు చేశారు. కార్మికులకు సింగరేణి లాభాలలో వాటా ఇప్పించడం జరిగిందని తెలిపారు. అనంతరం అర్హులైన సింగరేణి కార్మిక కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, సింగరేణి సంస్థ అధికారులు, సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.



## జిల్లా పర్యటనలో మంత్రి జూపల్లి కృష్ణారావు

- స్వాగతం పలికిన కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, జూన్ 13, ప్రభాతవార్త:




రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం జిల్లాలో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన మంత్రికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఘన స్వాగతం పలికారు. అటవీ శాఖ వసతి గృహానికి చేరుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావుకు కలెక్టర్ భవేశ్ మిశ్రా పూల మొక్కను అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి పోలీసుల నుంచి సలామీ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొని మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో సాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. మంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసింది.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట ఏది...

స్కూల్ ఫీజుల పేరిట దోపిడీ ఆపాలి... స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి... ముల్కల్ల రాజేంద్రప్రసాద్

మంచిర్యాల, జూన్ 13, ప్రభాతవార్త



తెలంగాణ రాష్ట్రంలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల పేరుతో తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతున్నాయని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు, మరోవైపు కుటుంబ పోషణ భారంతో ప్రజలు సతమతమవుతుంటే, ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచి మధ్యతరగతి, పేద కుటుంబాలను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి, తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకుని లక్షల రూపాయల ఫీజులు వసూలు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. మంచిర్యాల జిల్లాలో అనేక ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా తమకు నచ్చిన విధంగా అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాలు, రవాణా పేర్లతో అదనపు భారాన్ని మోపుతున్నాయని ఆరోపించారు. పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి చదివిస్తున్న తల్లిదండ్రుల శ్రమను దోపిడీ చేయడం అమానుషమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వెంటనే ఫీజులను సమీక్షించి తగ్గించాలని, అందుబాటు ధరల్లో నాణ్యమైన విద్యను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలల ఫీజు నిర్మాణంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తల్లిదండ్రులకు న్యాయం చేయకపోతే, ఈ సమస్యను జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు వెనుకాడబోమని ముల్కల్ల రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. విద్య అనేది ప్రతి చిన్నారి హక్కు అని, దానిని వ్యాపార వస్తువుగా మార్చే ప్రయత్నాలను ప్రజలందరూ కలిసి వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు.